సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 19 । ఆగస్టు । 2024



సోమశిలలో 23.734 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 23.734 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 11,066 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,750
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,670
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,870
నవర (8 గ్రాములు)	రూ.54,960

గరిష్టం/కనిష్టం
37.9 /28.9

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. రాత్రి ఉరుములు మెరుపులు ఉండొచ్చు. గాలిలో తేమ 56 శాతం ఉంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు సీఎం చంద్రబాబు రాక



పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(దర్గామిట్ట): సీఎం చంద్రబాబునాయుడు సోమవారం ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం శ్రీసిటీలో పలు పరిశ్రమలకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బిజినెస్ సెంటర్‌లో పరిశ్రమల సీఈఓలతో సమావేశమవుతారు. అనంతరం హెలికాప్టర్‌లో నెల్లూరు జిల్లాకు చేరుకుని సోమశిల జలాశయాన్ని పరిశీలిస్తారు.

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

సోమశిల: చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని ఆదివారం కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించారు. సీఎం హెలికాప్టర్‌లో సోమశిల జలాశయానికి రానుండడంతో హెలిప్యాడ్, రక్షణ ఏర్పాట్లు, జలాశయం ఆప్రాన్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రతిపాదనలు అన్ని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వారి వెంట ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీ వేణుగోపాల్, తహసీల్దార్ వీర వసంతరావు, సీఐ గంగాధర్‌రావు, ఎస్సైలు సుబ్బారావు, సూర్యప్రకాష్‌రెడ్డి ఇతర అధికారులు ఉన్నారు.

నేడు పీజీఆర్‌ఎస్ రద్దు

నెల్లూరు (క్రైమ్): సీఎం చంద్రబాబు సోమవారం జిల్లాలో పర్యటించనున్న దృష్ట్యా జిల్లా పోలీసు కార్యాలయంలో జరగనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం రద్దు చేసినట్లు పోలీసు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ విషయాన్ని ఫిర్యాదుదారులందరూ గమనించి ఎవరూ పోలీసు కార్యాలయానికి రావొద్దని సూచించింది.

ప్రేమించి మోసపోయి యువతి ఆత్మహత్య

నెల్లూరు (క్రైమ్): ప్రేమపేరుతో మోసం చేయడంతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని ముత్యాలపాళెంలో ఆదివారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. ముత్యాలపాళెంలో వెంకటరమణ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె జీవిత (19) పదో తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దనే ఉంటోంది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో రామ్మూర్తినగర్‌కు చెందిన ప్రతాప్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమకు దారి తీసింది. కొంతకాలంగా ఆమె అతన్ని వివాహం చేసుకోమని కోరుతుండగా కాలయాపన చేస్తూ వచ్చాడు. దీంతో ఆమె మనస్తాపానికి గురైంది. ఆదివారం వెంకటరమణ దంపతులు తమ చిన్న కుమార్తెకు అనారోగ్యంగా ఉండడంతో ఆమెను తీసుకుని హాస్పిటల్‌కు వెళ్లారు. ఈ క్రమంలో జీవిత ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆస్పత్రి నుంచి దంపతులు ఇంటికి వచ్చి చూడగా కుమార్తె ఉరేసుకుని మృతి చెంది ఉండడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలాజీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావు, ఎస్‌ఐ మాహబూబ్‌సుభాని ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్‌ను గర్భవతిని చేసిన యువకుడు

- 6 నెలల గర్భిణిగా నిర్ధారించిన వైద్యులు

కావలి: పట్టణానికి చెందిన 15 ఏళ్ల బాలికను 21 ఏళ్ల యువకుడు గర్భవతిని చేసిన దురాగతం ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాలిక కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కావలికి చెందిన ఒక కుటుంబం ప్రకాశం జిల్లా దర్శి మండలం రాజంపల్లికి వలస వెళ్లింది. వారికి 7వ తరగతి చదువుతున్న ఒక కుమార్తె ఉంది. ఈ క్రమంలో ఆ గ్రామానికి చెందిన బీటెక్ చదువుతున్న ఒక యువకుడు ప్రేమ పేరుతో ఆ బాలికను లోబరుచుకున్నాడు. అయితే ఆ యువకుడు తమ కుమార్తె వెంట పడుతున్నాడనే అనుమానంతో బాలిక కుటుంబ సభ్యులు అతని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. రాజంపల్లి నుంచి ఆ కుటుంబం మళ్లీ కావలి పట్టణానికి తిరిగి వచ్చేసింది. బాలికను పట్టణంలో 7వ తరగతిలో చేర్పించారు. గడిచిన 10 రోజుల నుంచి బాలిక నీరసంగా ఉంటోంది. ఈ క్రమంలో కళ్లు తిరిగి పడిపోవడం, కడుపు ఎత్తుగా ఉందనే అనుమానంతో వైద్యుల వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. అయితే ఆ బాలిక 6 నెలల గర్భవతిగా నిర్ధారించారు. దీంతో బాలికను కుటుంబ సభ్యులు గట్టిగా ఆరా తీయగా, రాజంపల్లికి చెందిన యువకుడు 15 సార్లు తనను శారీరకంగా కలిసినట్లు బాలిక చెప్పింది. ఈ మేరకు బాధిత మైనర్ బాలిక కుటుంబ సభ్యులు కావలిలోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. నేరం జరిగిన ప్రదేశం ప్రకాశం జిల్లా కావడంతో జీరో ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేసి, ప్రకాశం జిల్లా దర్శి పోలీసులకు కేసు దర్యాప్తు బాధ్యతలను అప్పగించనున్నారు.

పంచభూతాల సాక్షిగా..
భూగర్భ శోకం

ప్రకృతి సంపద దోపిడీ చేస్తున్న 'పచ్చ' ముఠాలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

అధికారం అండతో 'పచ్చ' ముఠాలు ప్రకృతి సంపదను కొల్లగొట్టుతున్నాయి. పంచభూతాల సాక్షిగా భూగర్భాన్ని కుళ్లబొడుస్తున్నారు. ఉద్యమంలా ఊరూరా సహజ వనరులు కొల్లగొడుతున్నారు. వాల్టా, మైనింగ్ చట్టాలను తుంగలో తొక్కి.. ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే మట్టి, ఇసుక, గ్రావెల్‌ను భారీ యంత్రాలు పెట్టి తవ్వేస్తున్నారు. కట్టడి చేయాల్సిన సంబంధిత శాఖల అధికారులు ధృతరాష్ట్రుల్లా వ్యవహరిస్తున్నారు. కళ్ల ముందే గ్రావెల్, మట్టి కోసం చెరువులను తవ్వుతున్నా పట్టించుకోవడం లేదు. పెన్నానదితో పాటు ఉప నదులు, వాగులు, వంకల్లో నుంచి ఇసుకను లోడేస్తున్నా చూసీచూడనట్లు పోతున్నారు. సొంత అవసరాలకు తీసుకెళ్లే వాహన యజమానులపై కేసులు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేసి కాలర్ ఎగరేస్తున్నారు.





నెల్లూరు రూరల్‌లోని కనపర్తిపాడు చెరువు నుంచి మట్టిని తరలించడంతో ఏర్పడిన గోతులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'పచ్చ' నేతల ధన దాహానికి నేల తల్లి క్షోభిస్తోంది. అధికార పార్టీ నేతలు జేసీబీలు, టిప్పర్లు, ట్రాక్టర్లతో ఊరూరా దండయాత్రగా వెళ్లి ప్రకృతి సంపదను దోచుకుంటున్నారు. దొంగలు.. దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్లుగా కూటమి నేతలు, అధికారులు కలిసి వనరులను కొల్లగొట్టుతున్నారు. రెండు నెలలకు పైగా నిర్విరామంగా ఎమ్మెల్యేల కనుసన్నల్లో చెరువుల్లో మట్టి, గ్రావెల్, వాగులు, వంకలు, నదుల్లో ఇసుక తవ్వేసి అక్రమ రవాణా చేస్తున్నా.. జిల్లా ఉన్నతాధికారులైన కలెక్టర్, ఎస్పీలు మౌనంగా ఉన్నారు. నిన్నటి వరకు రూపాయికి టికాణి లేని టీడీపీ నేతలు కేవలం రెండు నెలల్లో ఇప్పుడు రూ.కోట్లకు పడగలెత్తారు. జిల్లాలో సర్వేపల్లి, ఆత్మకూరు, కందుకూరు, కావలి, ఉదయగిరి, కోవూరు నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు మరింతగా రెచ్చిపోతున్నారు.

సర్వేపల్లిలో..



ముత్తుకూరు మండలం బ్రహ్మదేవి నుంచి తరలిస్తున్న మట్టి

సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం, ముత్తుకూరు మండలాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రావెల్ అక్రమ రవాణా సాగిస్తూ చెలరేగిపోతున్నారు. గ్రావెల్, మట్టి, ఇసుక తరలింపులో నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేత పూర్తి సహకారం అందిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమ గ్రావెల్ తరలింపు ఇష్టానుసారం నెలకొంది. వెంకటాచలం మండలం గొలగమూడి పడమటి చెరువు, రామదాసుకండ్రిక, జాతీయ రహదారి పక్కనే వెంచర్లకు మట్టిని తోలుతున్నారు. ముత్తుకూరు మండలం బ్రహ్మదేవి నుంచి మట్టిని అక్రమంగా పట్టపగలు తోలుకున్నా అడిగే నాథుడు లేకుండాపోయారు. జిల్లా మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. పొదలకూరు మండలం విరువూరు ఇసుక రీచ్ నుంచి టీడీపీ నాయకులు ఇసుకను తరలిస్తున్నారు. విరువూరు ఇసుకరీచ్ నుంచి ఇసుకను తరలించేందుకు అనుమతులు లేవు. ఇదే మండలం సూరాయపాళెం ఇసుక రీచ్‌కు త్వరలో అనుమతులు లభించనున్నాయి. అనుమతులు లభిస్తే ఏ స్థాయిలో అక్రమాలు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

నెల్లూరు రూరల్‌లో..

నెల్లూరు రూరల్ పరిధిలోని కల్లూరుపల్లి కొత్త చెరువును స్థానిక టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. రాత్రిళ్లు భారీ యంత్రాలు పెట్టి 10 నుంచి 15 ట్రాక్టర్లతో చెరువులో మట్టి, గ్రావెల్‌ను తవ్వేసి తరలిస్తున్నారు. ఇరిగేషన్, పోలీసు శాఖ అధికారులతో విషయం తెలిసినా చోద్యం చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. టిప్పర్ల కొద్దీ గ్రావెల్‌ను తరలిస్తున్నారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామును 5 గంటల వరకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు అక్కడికి చేరుకుని చెరువు మట్టిని రవాణా చేస్తున్నారు. అయితే వారంలో మూడు రోజులు ఈ తంతు చేస్తున్నట్లు సమాచారం. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చోటానాయకులు అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నరసింహకొండ వరకు విస్తరించిన నెల్లూరు చెరువులో మట్టి తవ్వకాలు చేసి సమీపంలోని వెంచర్లకు రవాణా చేస్తున్నారు. పొట్టేపాళెం వద్ద పెన్నానది రీచ్‌లో రేయింబవళ్లు ఇసుక తవ్వకాలు ఆగడం లేదు.

కందుకూరులో..

కందుకూరు మండలం దొండపాడు, పాలూరు, గోపాలపురం గ్రామాల నుంచి నిత్యం 20 ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. గుండ్లపాళెం, కళవళ్ల వద్ద మన్నేరు ఇసుకకు మంచి డిమాండ్ ఉంది. మన్నేరు, పాలేరుల్లో భారీగా తవ్వకాలు జరుగుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని, వ్యవసాయ, మంచినీటి స్కీమ్‌ల బోర్లకు నీరందే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక తరలింపు జరుగుతోంది.



దొండపాడు వద్ద మన్నేరులో ఇసుక తవ్వకాలు

పోలీస్, సెబ్ అధికారులు ఒక ట్రాక్టర్‌కు నెలకు రూ.15 వేలు వసూలు చేస్తూ.. అటు వైపు కన్నెత్తి చూడడం లేదు.

ఉదయగిరిలో..

ఉదయగిరి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో యథేచ్ఛగా ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ నేతలు అందినకాడికి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ దోచుకుంటున్నారు. ఉదయగిరి మండలంలోని నేలటూరు, గండిపాళెం, వరికుంటపాడు మండలం గువ్వాడి, తూర్పుబోయమడుగుల, కనియంపాడు, రామదేవులపాడు, గణేశ్వరపురం పిల్లాపేరు పరీవాహక ప్రాంతాల్లో ట్రాక్టర్ల ద్వారా నిత్యం ఉదయగిరి, పామూరు పట్టణాలకు ఇసుక అక్రమ రవాణా సాగుతూనే ఉంది. ఈ అక్రమ రవాణా వెనుక అధికార పార్టీ నేతలు ఉండడంతో పోలీసులు పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. అత్యవసరాల కోసం సొంతంగా ఇళ్లు కట్టించుకునే వారు



ఉదయగిరి పెద్ద చెరువు నుంచి అక్రమంగా రవాణా అవుతున్న గ్రావెల్

అధికార పార్టీ వారు కాకుండా ఇతరులు ఇసుక తవ్వుకుంటే క్షణాల్లోనే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి, జలదంకి మండలాల్లో జరుగుతున్న జాతీయ రహదారి పనులకు సంబంధించి ఆయా సమీప ప్రాంతాల్లోని చెరువుల్లో యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నారు.

కావలిలో..

కావలి నియోజకవర్గంలోని కావలి పెద్ద చెరువుతో పాటు రుద్రకోట, తాళ్లపాళెం, కొత్తపల్లి, చలంచర్ల చెరువుల నుంచి మట్టి, గ్రావెల్ విచ్చలవిడిగా జరుగుతున్నాయి. బోగోలు మండలంలోని కప్పరాళ్ల తిప్ప ప్రాంతం నుంచి నిత్యం వందల సంఖ్యలో టిప్పర్లతో గ్రావెల్ రవాణా జరుగుతోంది. దగదర్తి, అల్లూరు మండల్లాలోని సున్నపుబట్టి చెరువుతో పాటు గడ్డగుంట, బీరంగుంట ప్రాంతాల్లోని గ్రావెల్ గనులను దోచేస్తున్నారు.



పాలూరు వద్ద మన్నేరు నుంచి ఇసుక తరలింపు

ఆత్మకూరులో..



చేజర్ల మండలం టీకేపాడు చెరువు కట్ట వద్ద ట్రాక్టర్లతో తరలించి ఏర్పాటు చేసిన ఇసుక డంప్

సోమశిల నుంచి సంగం వరకు ఉన్న పెన్నానదిని కుళ్లబొడిచేస్తున్నారు. అనంతసాగరం మండలం శంకరనగరం, రేవూరు, బెడుసుపల్లి, దేవరాయపల్లి, లింగంగుంట, పీకేపాడు, సోమశిల ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. రోజుకు కనీసం 50 నుంచి 60 టిప్పర్లతో చెన్నై, బెంగళూరుకు రవాణా చేస్తున్నారు. చేజర్ల మండలంలోని తూర్పుకంభంపాడు. ఉలపపల్లి గ్రామాల్లో పెన్నానది నుంచి ఇసుకను ట్రాక్టర్లతో తరలించి చెరువుకట్ట దగ్గర డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి టిప్పర్ల ద్వారా దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం, వాశిలి, సంగం నుంచి రాత్రి వేళల్లో ఇసుకను బయటకు తరలించి డంపింగ్ చేసి అక్కడి నుంచి టిప్పర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు. స్థానిక టీడీపీ నాయకులే ఈ అక్రమ దందా నిర్వహిస్తున్నారు. పెన్నా ఇసుక అనేక రీచ్‌ల నుంచి అక్రమంగా తరలిస్తున్నారన్న విషయాన్ని ఎన్నిమార్లు అధికారులకు చెప్పినా, మీడియాల్లో కథనాలు వచ్చినా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు మండిపడుతున్నారు. అనంతసాగరం మండంలోని అగ్రహారం, పాతాళపల్లి, మంచాలపల్లి గ్రామాల చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఆత్మకూరులోని రాయలచెరువులోనూ మట్టి తవ్వకాలు విచ్చలవిడిగా చేస్తున్నారు. నిత్యం వందలాది ట్రాక్టర్లలో మట్టిని రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇసుకల తయారీలకు తోలుతున్నారు.

కోవూరులో..

కోవూరు నియోజకవర్గంలోని లేగుంటపాడు పంచాయతీ సుబ్బారెడ్డిపాళెం రీచ్, పల్లిపాళెం, ముదివర్తి తదితర ప్రాంతాల్లోని పెన్నానది పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.

మనీ స్కీమ్ మోసం

సభ్యత్వాన్ని బట్టి రూ.లక్షల నగదు ఇస్తామంటూ ప్రకటనలు

- ప్రజల బలహీనతను క్యాష్ చేసుకున్న నిర్వాహకులు
- జిల్లాలో పది వేల మంది నుంచి రూ. కోట్లలో వసూళ్లు
- చెల్లింపుల జాప్యంతో ఆందోళనకు దిగిన బాధితులు



చెన్నైలోని చారిటబుల్ ట్రస్ట్ సంస్థ కార్యాలయం

సాక్షిప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో మరో మనీ స్కీమ్ మోసం వెలుగులోకి వచ్చింది. గతంలో ఓ మతం తరపున మనీ స్కీం పేరుతో పేద వర్గాల నుంచి రూ.కోట్లు కట్టించుకుని నిలువు దోపిడీ చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో సంచలనం కలిగించిన ఆ కేసును సీఐడీకి అప్పగించారు. అమాయక ప్రజల బలహీనతలే పెట్టుబడులుగా పెట్టించి దోపిడీ చేశారు. అదే తరహాలో నెలవారీగా రూ.వందల్లో కడితే రూ.లక్షల్లో ఇస్తామంటూ నమ్మించి రూ.కోట్లు దండుకున్న వైనం జిల్లాలో ఆదివారం వెలుగు చూసింది. 'తీరన్ ట్రస్ట్', 'వీఏ ఎంటర్ ప్రైజస్'లో నగదు చెల్లించి సభ్యత్వాలు తీసుకుంటే నిర్ణీత వ్యవధిలో రూ.లక్షలు చెల్లిస్తామని ప్రచారం చేయడంతో పెద్ద ఎత్తున సభ్యత్వాలు తీసుకున్నారు. నిర్ణీత గడువు పూర్తయినా నగదు చెల్లించకపోవడంతో ఆదివారం నెల్లూరు నగరంలోని ఆ సంస్థ అనుబంధ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తితే.. జిల్లాకు చెందిన వి.కొండయ్య తన కుమారుడి జ్ఞాపకార్థం చారిటబుల్ ట్రస్ట్‌ను 2021లో పొదలకూరురోడ్డులోని కేన్సర్ హాస్పిటల్ సమీపంలో ఏర్పాటు చేశారు. ఆపదలో ఉన్న వారికి తన వంతు సాయం చేయసాగాడు. 2022లో చెన్నైకు చెందిన తీరన్ చారిటబుల్ ట్రస్ట్, వీఏ ఎంటర్ ప్రైజస్ సంస్థ నిర్వాహకులతో ఆయనకు పరిచయం అయింది. తాము వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నామని, తద్వారా వచ్చిన ఆదాయాలన్ని పేదల అభ్యున్నతికి వెచ్చిస్తామని నిర్వాహకులు తెలిపారు. అయితే సాయం పొందాలనుకునే వారు ట్రస్ట్‌లో సభ్యులై ఉండాలని, రూ.500 సభ్యత్వం తీసుకున్న వారికి రూ.7 లక్షలు, రూ.5 వేలతో సభ్యత్వం తీసుకున్న వారికి రూ.18 లక్షలు ఇస్తామని చెప్పుకొచ్చారు. సభ్యుల ఇంట్లో జరిగే శుభకార్యాలకు ఆర్థిక సాయం చేస్తామని, పెళ్లిళ్లకు తాళిబొట్లు, డబుల్ కాట్ మంచం, బీరువాలు, ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు ఆర్థికసాయం చేస్తామని ప్రచారం చేయడంతో చాలా వరకు ఆ సంస్థ సభ్యత్వం తీసుకునేందుకు పేదలు ఎగబడ్డారు.



చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కొండయ్య

జిల్లాలో పది వేల మంది

కొండయ్య తన కార్యాలయంలోనే తీరన్ చారిటబుల్ ట్రస్ట్ శాఖను ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని విస్తృత ప్రచారం చేశారు. దీంతో అనేక మంది నగదు చెల్లించేందుకు కార్యాలయం వద్దకు వచ్చారు. వారికి మరింత నమ్మకం కలిగించేందుకు ఆయన వారిని చెన్నైలోని ట్రస్ట్, ఎంటర్ ప్రైజస్ కార్యాలయాలకు తీసుకెళ్లి నిర్వాహకులతో మాట్లాడించారు. దీంతో జిల్లాకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో సభ్యత్వాలు కట్టేందుకు సంస్థ అనుబంధ కార్యాలయం వద్ద క్యూ కట్టారు. సభ్యత్వం తీసుకున్న వారి ఇళ్లలో వివాహ కార్యాలు, అశుభ కార్యాలకు ముందుగా చెప్పిన విధంగానే నిర్వాహకులు గృహోపకరణాలు, నగదు ఇవ్వడంతో దానిని చూసి మరి కొందరు సభ్యత్వాలు తీసుకునేందుకు ముందుకు వచ్చారు. జిల్లాలో ఇప్పటి వరకు 10 వేల మంది సభ్యత్వాల ద్వారా, ట్రస్ట్, ఎంటర్ ప్రైజస్ సంస్థల ఖాతాల్లో రూ.కోట్లు జమయ్యాయి. కొంత కాలం అనంతరం శుభకార్యాలకు, అశుభకార్యాలకు గృహోపకరణాలు, ఆర్థిక సాయం అందించడం నిలిపివేశారు. సభ్యత్వం తీసుకుని సంవత్సరాలు గడుస్తున్నా.. డబ్బులు చెల్లించకపోవడంతో జిల్లాకు చెందిన కొండయ్యను నిలదీశారు. నిర్వాహకులతో మాట్లాడి నగదు ఇప్పిస్తానని నమ్మబలికారు. అయినా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో అందరూ తమను మోసగించారని ఆరోపిస్తూ ఆదివారం పలువురు బాధితులు నెల్లూరులోని అనుబంధ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తమకు న్యాయం జరిగకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రెండు నెలల్లో ఇస్తామన్నారు..

తాను అందరిలా బాధితుడేనని కొండయ్య తెలిపారు. సభ్యత్వం కడితే రూ.లక్షల్లో నగదు ఇస్తామని ట్రస్ట్, ఎంటర్‌ప్రైజస్ నిర్వాహకులు నమ్మబలికారని, వారి మాటలు పేదలకు సాయం చేసే విధంగా ఉండడంతో తాను, తనతో పాటు తెలిసిన వారి ద్వారా ఆయా సంస్థల్లో సభ్యత్వాలు కట్టించానని చెప్పారు. 10 వేల మందిలో 350 మంది రూ.5 వేలు, రూ.6 వేలు చొప్పున కట్టారని, మిగిలిన వారందరూ దాదాపుగా రూ.500 చెల్లించి సభ్యత్వాలు పొందారాన్నారు. డబ్బులు చెల్లింపు విషయమై నిర్వాహకులతో మాట్లాడగా సెప్టెంబర్, అక్టోబర్‌లో అందరికీ ఇచ్చేస్తామని చెప్పారని వెల్లడించారు.

నిమ్మ ధరలు పైపైకి..

- బస్తా కాయలు రూ.10 వేలు



యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు: సాధారంగా ఆగస్టు నెలలో నిమ్మకాయలను అడిగే వారుండరు. ధరలు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. అయితే వారం రోజులుగా మార్కెట్లో నిమ్మ కాయలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. శ్రావణ మాసంలో ప్రత్యేక పూజలు, వివాహాలు, గృహ ప్రవేశాల నేపథ్యంలో కాయల ధరలు అమాంతం పెరిగాయి. బస్తా (లూజు) రూ.7 వేల నుంచి రూ.10 వేలు ధర పలుకుతున్నాయి. కిలో రూ.80 నుంచి రూ.120 ధరలు పలుకుతున్నట్లు వ్యాపారులు వెల్లడించారు. గతంలో ఎప్పుడూ ఆగస్టు నెలలో ఈ స్థాయిలో ధరలు పెరిగింది లేదు. తోటల్లో నిమ్మకాల దిగుబడి గణనీయంగా తగ్గిపోయిన నేపథ్యంలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. రైతుల అదృష్టం బాగుండి రెండు బస్తాల నాణ్యత కలిగిన కాయలు తోటలో ఉంటే సుమారు రూ.20 వేల వరకు నగదు మార్కెట్ నుంచి తెచ్చుకునేందుకు అవకాశం ఉంటుంది. పండు కాయలు కూడా కిలో రూ.60 పైమాటే అమ్ముడుపోతున్నాయి. ఆగస్టులో ఎండలు మండుతున్న నేపథ్యంలో రైతులు తోటలకు నీరు పెట్టడం లేదు. ఇప్పుడు నీరు పెడితే త్వరగా పూతపూసి కాయల దిగుబడి ధరలు లేని సమయంలో ఉంటుందని భావిస్తున్నారు. ఆలస్యంగా నీరు పెడితే జనవరి, ఫిబ్రవరి నెలల్లో కాయల దిగుబడి పెరిగితే ధరలు గిట్టుబాటు అవుతాయని రైతులు కాలయాపన చేస్తున్నారు. దీంతో తోటలు బెట్టకు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రతి సీజన్లో కాయలు కావాలనుకునే రైతులు మాత్రం తమ తోటలకు నీరు పెడుతున్నారు.

క్లుప్తంగా

ఒక్కసారిగా గాలివాన


దెబ్బతిన్న సచివాలయ భవనం

మర్రిపాడు: మండలంలోని పడమటినాయుడు పల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా గాలివాన వచ్చింది. మన్నే ఓబుల్‌రెడ్డి అనే వ్యక్తి ఇంటి ఎదురుగా ఉన్న వేపచెట్టుపై పిడుగు పడింది. దీంతో కొమ్మ విరిగిపోయింది. సమీపంలోనే ఉన్న ఓ వ్యక్తి ఆ శబ్దానికి స్పృహ కోల్పోయి పడిపోయాడు. బంధువులు అప్రమత్తమై కాపాడారు. అదే విధంగా చుంచులూరులోని సచివాలయ భవనంపై పిడుగు పడడంతో గోడ బీటలు వారింది. చుంచులూరు, పడమటినాయుడుపల్లి పంచాయతీల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది.

ముగిసిన చెస్ పోటీలు


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కోవూరు: మండల కేంద్రంలోని శ్రీచైతన్య స్కూల్లో ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సహకారంతో పీపుల్ ఆఫ్ చెస్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు ప్రో చెస్ లీగ్ జరిగింది. 160 మంది పాల్గొన్నారు. వీరిలో 40 మంది అంతర్జాతీయ రేటింగ్ క్రీడాకారులున్నారు. ప్రథమ బహుమతిని బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన గొడ్డేటి హిమ తేజస్విని, ద్వితీయ బహుమతిని నెల్లూరుకు చెందిన మాకం రామలిఖిత్, తృతీయ బహుమతిని తమిళనాడుకు చెందిన సురేంద్ర సతీష్ దక్కించుకున్నారు. అన్‌రేటెడ్‌లో ప్రథమ బహుమతిని నెల్లూరుకు చెందిన కంభం శ్రీచైతన్య, ద్వితీయ బహుమతిని వెంకటగిరికి చెందిన విఘ్నేష్, తృతీయ బహుమతిని నెల్లూరుకు చెందిన సంజన గెలుచుకున్నారు. వెటరన్ విభాగంలో పీవీ శ్రీనివాసులు ప్రతిభ చూపారు. వీరికి బహుమతులను అసోసియేషన్ అధ్యక్షుడు బి.సత్యనారాయణ అందజేశారు. కార్యదర్శి వై.సుమన్‌ను అభినందించారు. నిర్వాహకులు ప్రదీప్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల హల్‌చల్

- పలువురిపై దాడి
- పోలీసులనూ లెక్క చేయని వైనం


మాట్లాడుతున్న మున్సిపల్ కార్మికులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మద్యం మత్తులో కొందరు యువకులు రెచ్చిపోయారు. పలువురిపై దాడి చేసిన ఘటన శనివారం అర్ధరాత్రి పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. మద్యం తాగిన యువకులు ఓ మూగ వ్యక్తి, విధుల్లో ఉన్న మున్సిపల్ కార్మికులపై దాడి చేశారు. వాహనాలను ఆపి భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే సదరు యువకులు వారిని సైతం లెక్క చేయలేదు. రాత్రి సమయంలో తాము పని చేయలేమని మున్సిపల్ కార్మికులు విధులను బహిష్కరించారు. విషయం తెలుసుకున్న కమిషనర్ రమణబాబు పోలీస్ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వగా వారు ఆదివారం విధులకు హాజరయ్యారు.

దొంగ అరెస్ట్

- ఏడు మోటార్‌బైక్‌ల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): మోటార్‌బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని నెల్లూరు సంతపేట పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.3.40 లక్షల విలువ చేసే ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా నల్లపాడు గ్రామానికి చెందిన షేక్ ఆదాం సాహెబ్ కేటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యసనాలకు బానిసైన అతను దొంగగా అవతారమెత్తాడు. నెల్లూరు నగరంలోని లాడ్జీలో మకాం వేసి చిన్నబజారు, బాలాజీనగర్, దర్గామిట్ట పోలీసుస్టేషన్‌ల పరిధిలో బైక్ దొంగతనాలకు పాల్పడసాగాడు. సాహెబ్ కదలికలపై సంతపేట ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి నిఘా ఉంచారు. ఆదివారం రంగనాయకులపేట పెన్నా బ్యారేజ్ వద్ద నిందితుడు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను దొంగతనం చేసినట్లు నేరం అంగీకరించాడు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.120
సన్నవి :	రూ.80
పండ్లు :	రూ.60

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	123
లేయర్ (లైవ్) :	100
బ్రాయిలర్ చికెన్ :	222
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	244
లేయర్ చికెన్ :	170

అలా వదిలేశారు!

పెద్దాస్పత్రిలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ప్రాణాంతక పరిస్థితులు పొంచి ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోగులకు చెందిన వ్యర్థాలు, మురుగు నీటిని నిర్లక్ష్యంగా వదిలేస్తే ప్రజలకు కొత్త జబ్బులు వస్తాయి. ఒక్కోసారి ప్రాణాంతకం కావొచ్చు. నెల్లూరు పెద్దాస్పత్రిలో మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను సుమారు రూ.2 కోట్లతో ఏర్పాటు చేశారు. అయితే ఆ ప్రాజెక్ట్‌కు గ్రహణం పట్టింది. పట్టుమని మూడు సంవత్సరాలు కూడా నిర్వహించలేదు.

- పెద్దాస్పత్రిలో మురుగునీటి శుద్ధి ప్లాంట్‌కు గ్రహణం
- సమీపంలో ఖాళీ ప్రదేశంలోకి చేరుతున్న మురుగునీరు
- పట్టించుకోని ఏపీఎంఎస్ఐడీసీ
- కలెక్టర్ ఆదేశాలతోనైనా మార్పు వచ్చేనా?

ఓపీ :	రోజూ సుమారు వెయ్యి పైనే..
ఇన్‌పేషెంట్లు :	సుమారు 500 మంది
డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది :	1,000 మంది

ఇలా..

ఆస్పత్రిలో ఓపీ రోజూ వెయ్యికి పైనే ఉంటుంది. ఇన్‌పేషెంట్లు సరాసరిన 500 మంది వరకు ఉంటారు. ఇక డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది సంఖ్య భారీగానే ఉంది. వీరందరూ వినియోగించిన నీరంతా కూడా ఆ సీవేజ్ ప్లాంట్‌లోకి చేరాలి. అలాగే మెడికల్ కళాశాలలో వైద్యవిద్యనభ్యసిస్తున్న వందలాది మంది వినియోగించే మరుగుదొడ్లలోని నీరు కూడా ఇక్కడికే రావాలి. ప్లాంట్ రోజుకు 60 వేల లీటర్ల నీటిని శుద్ధి చేస్తుంది.

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని పెద్దాస్పత్రిలోని మురుగునీటి శుద్ధి ప్లాంట్ (సీవేజ్ ప్లాంట్) మూతపడింది. 2013లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసినప్పుడే దీని ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు. 2017లో ప్రారంభించారు. మూడు అంతస్తులుగా నిర్మించారు. అండర్ గ్రౌండ్‌లో రెండతస్తులున్నాయి. మెషినరీతో కూడిన మరో బ్లాక్‌ను ఏర్పాటు చేశారు. పెద్దాస్పత్రిలో, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 426 డ్రెయినేజీ మ్యాన్‌హోల్స్ ఉన్నాయి. వీటి ద్వారా సీవేజ్ ప్లాంట్‌లోని భూగర్భ అంతస్తుల్లోకి రోగులు స్నానాలు చేసిన, మూత్ర, మలవిసర్జనకు చెందిన నీరు చేరుతోంది. అలాగే రోగులకు సంబంధించి క్లీన్ చేసిన నీరు, డాక్టర్లు, ఇతరులు వినియోగించిన వృథా నీరు కూడా ఈ మ్యాన్‌హోల్స్ ద్వారా భూగర్భ కాలువల నుంచి సీవేజ్ ప్లాంట్‌కు చేరేలా డిజైన్ చేశారు.


ప్లాంట్ లోపల ఇలా..



మూతపడిన మురుగునీటి శుద్ధి ప్లాంట్

మూలనపడింది

ఈ ప్లాంట్ నిర్వహణకు సంవత్సరానికి సుమారు రూ.10 లక్షలు ఖర్చవుతుంది. ప్రభుత్వానికి రాసి ఆ నగదును వచ్చేలా చూసుకోవడం, నిర్వహణ బాధ్యత ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) ద్వారా జరగాలి. అయితే ప్లాంట్‌ను ప్రారంభించాక మూడేళ్లు మాత్రమే నిర్వహించారు. అనంతరం నగదు అయిపోయింది. అప్పటి అధికారుల విజ్ఞప్తి మేరకు మరో సంవత్సరం కాంట్రాక్టర్ ఆ ప్రాజెక్ట్‌ను నిర్వహించారు. కోవిడ్ రావడంతో అధికారులు ఆ ప్లాంట్ నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో అది మూతపడిపోయింది. లోపల పలు వస్తువులు తుప్పు పట్టాయి. మోటార్లు రిపేర్లు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.


ప్లాంట్ పని చేయకపోవడంతో పక్కనే నిల్వ చేరిన మురుగునీరు

కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చాం



నేను నెల్లూరులో బాధ్యతలు చేపట్టకముందే ప్లాంట్ మూత పడి ఉంది. బాధ్యతలు చేపట్టాక ఈ విషయాన్ని మా శాఖ ఎండీ దృష్టికి, డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) వద్దకు తీసుకెళ్లాను. దీంతో బడ్జెట్ విడుదల చేసి టెండర్లు పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు ఎంత చెప్పినా పనులు మొదలు పెట్టలేదు. దీంతో వారికి నోటీసులు జారీ చేశాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్లాను. త్వరలోనే ప్లాంట్‌ను తిరిగి ప్రారంభిస్తాం.

– సుధాకర్‌గౌడ్, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

మురుగునీరు ఆరుబయటే..

సీవేజ్ ప్లాంట్ మూతపడడంతో మురుగునీరంతా పక్కనే ఆరుబయట చేరుతోంది. ఆ నీరు బయటికి వెళ్లేందుకు ప్రహరీకి రంధ్రాలు వేసి మున్సిపల్ డ్రెయినేజీలోకి కలుపుతున్నారు. సగం నీరు ప్లాంట్ చుట్టూ నిల్వ ఉండిపోయింది. ఇది అత్యంత ప్రమాదరకం.

వినియోగంలోకి తెస్తారా..

ఈనెల 9న ఆస్పత్రికి రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వచ్చారు. అదేరోజు 'అమాత్యా.. సమస్యలు ఆలకించవా..' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఇందులో ప్లాంట్ పరిస్థితి గురించి వివరించడం జరిగింది. దీంతో స్పందించిన కలెక్టర్ ఆనంద్ దాని గురించి ఆరా తీశారు. ఆయన ఆదేశాలతో ఇటీవల మున్సిపల్ సూపరింటెండెంట్ ఇంజినీర్, ఏఈ వచ్చి పరిశీలించి ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలంటే సుమారు రూ.13 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు సమాచారం. నిర్వహణ బాధ్యతను మున్సిపల్ అధికారులకు అప్పగించాలనే యోచనలో ఉన్నారు. త్వరితగతిన దీనిని వినియోగంలోనికి తీసుకొచ్చి ప్రజల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం


కోలాట ప్రదర్శన


సర్వభూపాల వాహనసేవలో వెంకయ్యస్వామి

- సర్వభూపాల వాహనంపై ఘనంగా ఊరేగింపు

వెంకటాచలం: మండలంలోని గొలగమూడిలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలో 42వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచి వివిధ పూజలు నిర్వహించారు. తొలిరోజు సర్వభూపాల వాహనసేవ నిర్వహించారు. మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగింపు చేశారు. గ్రామోత్సవంలో భక్తులు పాల్గొని ఓం నారాయణ.. ఆదినారాయణ అంటూ భజనలు చేశారు. చిన్నారులు, మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వచ్చి వెంకయ్యస్వామిని దర్శించుకున్నారు. అలాగే రాత్రి కల్ప వృక్ష వాహనసేవ కనులపండుగగా సాగింది. ఈ రెండు సేవలకు గొలగమూడి గ్రామస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ఆశ్రమ కార్యనిర్వాహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం ర్యవేక్షించారు.

- ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సూర్యప్రభ వాహనసేవ నిర్వహించనున్నారు. అలాగే రాత్రి 9 గంటలకు చంద్రప్రభ వాహనసేవ జరుగుతుంది.

నెల్లూరు క్లబ్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం


నూతన పాలకవర్గం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు క్లబ్ కొత్త పాలకవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. నగరంలోని దర్గామిట్ట బారాషహీద్ దర్గా ఎదురుగా ఉన్న క్లబ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో పలు విషయాలను చర్చించారు. క్లబ్‌ను భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కొందరు సూచనలిచ్చారు. ఇటీవల మృతిచెందిన కొప్పాల లీలామోహన్‌రెడ్డి స్థానంలో మరొకరిని ఈసీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకునే అంశంపై చర్చించారు. మాజీ సెక్రటరీ సునీల్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని నిర్ణయించారు. కొత్త పాలకవర్గం రెండేళ్లపాటు కొనసాగుతుంది. ఏడాదికి ఒకసారి సర్వసభ్య సమావేశం నిర్వహించి క్లబ్ అభివృద్ధికి నిర్ణయాలు తీసుకోనున్నారు. అధ్యక్షుడిగా కొండేటి శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వీరేపల్లి అశోక్, కార్యదర్శిగా పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా శ్రీహరిరెడ్డి, ఈసీ సభ్యులుగా జెట్టి సురేష్‌రెడ్డి, కంది విజయభాస్కర్‌రెడ్డి, కిలారి దినేష్, కారంశెట్టి ప్రవీణ్‌కుమార్, శోభన్‌బాబు, పాములు రమణయ్య ప్రమాణ స్వీకారం చేశారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కొడవలూరు: ప్రధాన రహదారి పక్కనే చెట్ల మాటున పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేసి రూ.4,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారి కథనం మేరకు.. కొడవలూరు పాత తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో కర్రతుమ్మ చెట్ల మాటున కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై హనీఫ్ అహ్మద్ సిబ్బందితో కలిసి వారికి అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో ఏఎస్సై గంధం ప్రసాద్, రైటర్ పాంకం వెంకటేశ్వర్లు, పీసీ సిరాజ్ పాల్గొన్నారు.

బైక్‌ను కాల్చేసి.. దుకాణంలో చోరీకి యత్నం


కాలిపోయిన బైక్


సీసీ టీవీ పుటేజీలో ఇలా..

వరికుంటపాడు: మండలంలో కొన్నిరోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతూ ఉండుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి కాకొల్లువారిపల్లె బస్టాండ్ సమీపంలో అంకాలమ్మ గుడి వద్ద సంధిరెడ్డి మాధవ అనే వ్యక్తికి చెందిన మోటార్‌బైక్‌ను దుండగులు తగులబెట్టారు. రామాపురం బీసీ కాలనీకి చెందిన కె.మాలకొండ రాయుడు జాతీయ రహదారి పక్కన దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అందులో చోరీకి దొంగలు యత్నించారు. తాళాలను పగులగొట్టే ప్రయత్నం చేశారు. అలికిడి కావడంతో అక్కడి నుంచి దొంగలు పరారయ్యారు. ఈ దృశ్యాలు సీసీ టీవీలో రికార్డయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు ఆదివారం తెలిపారు.

పెంచలకోనలో లక్ష తులసీ దళార్చన నేడు

రాపూరు: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో సోమవారం లక్ష తులసీ దళార్చన, లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఆదివారం తెలిపారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీవారి మండపంలో ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి స్వామికి తులసీ దళాలతో అర్చన, ఆదిలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలియజేశారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

కండలేరులో 5.872 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 5.872 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 100, లో లెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఆదివారం మోటార్‌బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామానికి చెందిన మదనంబేటి సుబ్రహ్మణ్యం, మునుస్వామి నాయుడుపేటకు చెందిన మునుస్వామితో కలిసి కనుపూరుకు బైక్‌పై వెళ్లారు. తిరిగి నాయుడుపేటకు వస్తుండగా వైఎస్సార్ సర్కిల్ మలుపు వద్ద వేగంగా వచ్చిన కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొన్న కారు


ఘటనా స్థలంలో కారు

ఉదయగిరి: మండలంలోని కుర్రపల్లి సమీపంలో ఆదివారం కారు అదుపుతప్పి రోడ్డు మార్జిన్ దిగి చెట్టును ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రోహిత్‌రెడ్డి స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. కారు ముందు భాగంగా బాగా దెబ్బతింది.

రూటు మార్చిన అక్రమార్కులు

- ఆదివారం కూడా గండిపాళెం ప్రాజెక్ట్‌లో చేపల వేట
- ఈ తంతు వెనుక అధికార పార్టీ హస్తం
- అందుకే అధికారుల మౌనం


గుడినరవ ఎస్సీకాలనీలో రవాణాకు సిద్ధం చేసిన బాక్స్‌లు

ఉదయగిరి: అక్రమార్కులు రూటు మార్చారు. మండలంలోని గండిపాళెం జలాశయంలో ఉన్న ఎంతో విలువైన మత్స్య సంపదను అక్రమంగా తరలించడం ఆపలేదు. ఆదివారం కూడా ప్రాజెక్ట్‌లో చేపలు పట్టి ఐస్‌బాక్స్‌ల్లో నిల్వ చేసి బయట ప్రాంతాలకు రవాణా చేశారు. ఈ వ్యవహారం వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉండడంతో మత్స్య శాఖ అధికారులు చర్యలు తీసుకునేందుకు సాహించడం లేదనే ఆరోపణలున్నాయి. చేపల వేట పట్టపగలే బహిరంగంగా జరుగుతున్నా.. పత్రికల్లో కథనాలు వస్తున్నా అక్రమార్కులు మాత్రం డోంట్‌కేర్ అనే రీతిలో ముందుకు సాగుతున్నారు. అవినీతి, అక్రమాలను సహించేది లేదని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బహిరంగంగా చెబుతున్నారు. కానీ ఇదంతా మాటలకే పరిమితమని తెలుస్తోంది.

ఇలా ముందుకు..

నిషేధం ఉన్నా వారం రోజుల నుంచి జలాశయంలో యథేచ్ఛగా చేపల వేట సాగుతోంది. ముఖద్వారం వద్ద నుంచే ప్యాకింగ్ చేసి రవాణా చేస్తున్నారు. ఈ తంతుపై ఆదివారం సాక్షిలో 'మాయమవుతున్న మత్స్య సంపద' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వ పెద్దలకు భయపడి అధికారులు మౌనంగా ఉండడంతో అక్రమార్కులు రూటు మార్చారు. పట్టిన చేపలను ముఖద్వారం వద్దకు తీసుకురాకుండా జలాశయం వెనుక వైపుగా అటవీ ప్రాంతంలో నుంచి తరలించి గుడినరవ ఎస్సీకాలనీలో ఓ ఇంటికి చేర్చారు. అక్కడ ఐస్‌బాక్స్‌ల్లో ప్యాకింగ్ చేసి నిల్వ ఉంచారు. అనంతరం వాహనాల్లో రవాణా చేశారు.

ఫిర్యాదు లేదు

ఈ వ్యవహారంపై మత్స్యశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావును వివరణ కోరగా అక్రమంగా చేపలు పట్టిన వారిపై, వారి వెనకున్న సూత్రధారులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సిబ్బందికి చెప్పామన్నారు. కానీ ఆదివారం రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.